తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త



## శ్రీచెంగాళమ్మకు చండీ అలంకారం

సూళ్లూరుపేట, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త

సూళ్లూరుపేటలోని శ్రీచెంగాళమాత పరమేశ్వరిదేవి దేవస్థానంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రులలో భాగంగా ఆదివారం అమ్మణ్ణి శ్రీచండీ అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చింది. నెల్లూరు ప్రియ దర్శిని ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన పందిళ్లపల్లి వెంకట శ్రీనాథరెడ్డి, నీరజ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. అలాగే శ్రీనాగేశ్వరస్వామి దేవస్థానంలో పార్వతీదేవికి శ్రీవిజయలక్ష్మిదేవి అలంకారం చేశారు. ఓడూరు సురేష్ రెడ్డి, మాధవీలత దంపతులు ఉభయకర్త లుగా వ్యవహరించారు. శ్రీచెంగాళమ్మ దేవస్థానంలో సహాయ కమిషనర్ బి.ప్రసన్నలక్ష్మి, నాగేశ్వరస్వామి దేవస్థానంలో ఛైర్మన్ తాటిపర్తి ఆదినారాయణరెడ్డి పర్యవేక్షించారు.

## త్రిశక్తి స్వరూపిణీ మహాచండీ నమోస్తుతే...!!

బోయకొండ(చౌడేపల్లి), సెప్టెంబర్ 28 ప్రభాతవార్త



బోయకొండ గంగమ్మ ఆలయంలో జరుగుతున్న దసరా శరవన్నరాత్రి ఉత్సవాల్లో భాగంగా 6వ రోజైన ఆదివారం అమ్మలను గన్న గంగమ్మ మానవాళి సంరక్షణమయి మహాచండీగా భక్తులకు దర్శనమిచ్చింది. ఉదయాన్నే వేదపండితులు, అర్చకులచే గంగమ్మకు విశేషాభిషేకం, అలంకరణ గావించారు. తిరుపతి వేణుగోపాల్‌రెడ్డి, సుగుణ, బెంగళూరు రఘునాథ, సుధ, వరలక్ష్మమ్మ, శ్రీనివాసులు, సుందరమూర్తి, ప్రియాంక, చౌడేపల్లి, నాగేశ్వరరావు, వెంకట్రమణమ్మ, పుంగనూరు రాము, నాగమణి, అమర్‌నాథ్, అనుషాల ఉభయదారులుగా వ్యవహరించారు. వారికి అమ్మవారి పవిత్ర తీర్థ ప్రసాదాలు, మెమొంటోలిచ్చి సత్కరించారు. ఆలయ ఇఓ ఉప కమీషనర్ ఏకాంబరం, అధికార, సిబ్బంది సేవలందించారు.

# విశ్వమోహనుకిదే విశ్వమోహనసేవ



గరుడవాహనసేవకు పోటెత్తిన జనం, గరుడవాహనంపై నాలుగుమాడా వీధుల్లో విహరిస్తున్న దేవదేవుడు



### -సాయంత్రం 6.07గంటలకే తెరతీసి హారతులు -గరుడసేవను వీక్షించిన మూడులక్షలమంది భక్తులు -పటిష్ట ఏర్పాట్లుతో వాహనసేవ ప్రశాంతం

తిరుమల,సెప్టెంబర్28 ప్రభాతవార్తప్రతినిధి:

దివ్యక్షేత్రంలో దివ్యమంగళరూపంగా జరుగుతున్న దేవదేవుని బ్రహ్మోత్సవాల్లో అత్యంత విశిష్టమైన గరుడవాహనసేవ ఆదివారం రాత్రి భక్తుల గోవిందనామస్మరణల మధ్య సాగింది. గరుడవాహనంపై అధిరోహించిన మలయప్ప భక్తకోటిని కటాక్షించాడు. విశేషసర్వాలంకభూషితుడైన గరుడాద్రివాసుడు చల్లటివాతావరణంలో వింజామరలు చల్లగా విసురుతుండగా భక్తుల గోవిందనామ్మరణల మధ్య అక్కడ భక్తకోటిని కటాక్షించడానికి ఆలయమాఢవీధుల్లో కదిలాడు.

108 వైష్ణవదివ్యదేశాల్లో గరుడసేవ అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఈ వాహనంద్వారా స్వామివారు దాసానుదాస ప్రపత్తికి తానుదాసుడని తెలియజేశారు. గరుడుని దర్శిస్తే సర్వపాపాలు తొలగుతాయని భక్తకోటికి తెలియజేశాడు. మెల్లగా మాఢవీధుల్లో వేచివున్న భక్తజనానికి స్వామివారు అభయమిచ్చాడు. గతంలకంటే భిన్నంగా ఈ ఏడాది సాయంత్రం 6.07గంటలకు వాహనమండపం తెరతీసి స్వామికి కర్పూర హారతులిచ్చారు. బోర్డు సభ్యులు, టిటిడి అధికారులు, విఐపిలకు హారతి, శఠారి ముగిసిన తరువాత 6.45గంటలకు స్వామివారు వాహనమండపం నుండి వెలుపలకు రావడంతో ఒక్కసారిగా భక్తుల గోవిందనామస్మరణలు మిన్నుముట్టాయి. అక్కడ నుండి మెల్లగా మొదలైన గరుడవాహనం రాత్రి 11.55గంటల వరకు సాగింది. ఈ వాహనసేవ అనంతరం భక్తులు ప్రశాంతంగా సురక్షితంగా తిరుపతికి ఆర్టీసి బస్సుల్లో గమ్యస్థానాలకు చేరారు. ఈ వాహనసేవలో పెద్దజీయర్‌స్వామి,చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, బోర్డు సభ్యులు శాంతారాం, దివాకర్‌రెడ్డి,పనబాకలక్ష్మి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జంగాకృష్ణమూర్తి, టిటిడి ఈఓ అనిల్‌కుమార్‌సింఘాల్ దంపతులు, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, తిరుపతి కమిషనర్ మౌర్య, సివిఎస్ఓ మురళీకృష్ణ, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు,తిరుమల అడిషనల్‌ఎస్పీ రామకృష్ణ, డిఎస్పీ విజయశేఖర్, విఎస్ఓలు ఎస్టీవిరామ్‌కుమార్, సురేంద్ర, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం ,సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి, అర్చకులు,వేదపండితులు,,ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీకల్యాణ వెంకన్న గరుడోత్సవం

### -గరుడవాహన సేవకు పోటేత్తిన భక్తజనం

తిరుపతిరూరల్,సెప్టెంబర్28 ప్రభాతవార్త:



శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి గరుడోత్సవానికి భక్తులు పోటేత్తారు. తిరుపతిరూరల్ మండలం తుమ్మలగుంటలో వెలసిన శ్రీకల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వేద పండితుల మంత్రాలు, భక్తుల గోవింద నామాలు, మంగళ వాయిద్యాలు, కోలాటాలు, చెక్క భజనలు, దేవతా మూర్తుల కళా రుపాలతో తుమ్మలగుంట గ్రామం ఆధ్యాత్మికతను సంతరించుకుంది. వెంకన్న బ్రహ్మహోత్సవాలలో ప్రధాన ఘట్టమైన గరుడోత్సవం వైభవోపేతంగా సాగింది. తిరుమల వెళ్ళి శ్రీవారి గరుడోత్సవాన్ని తిలకించలేని భక్తులు సుమారు 75వేల మంది తుమ్మలగుంట గరుడోత్సవాన్ని తిలకించారని నిర్వాహకులు తెలిపారు.

## అదనపు రిజిస్ట్రార్ విచారణ నివేదికపై ఉత్కంఠ

### వైఎస్సార్సీ హయాంలో అక్రమాలపై ఫిర్యాదులు ..విచారణ!! - నేడు కుప్పం రెస్కో మహాజనసభ !!

కుప్పం, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త

కుప్పం గ్రామీణ విద్యుత్ సహకార సంఘం (రెస్కో)కు సంబంధించి రాష్ట్ర సహకార సంఘాల అదనపు రిజిస్ట్రార్ ఇచ్చిన విచారణ నివేదిక ఉత్కంఠతకు సోమవారం తెరపడనుంది. సోమవారం కుప్పం రెస్కో మహాజన సభ స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కార్యాలయ ఆవరణలో నిర్వహించనున్నారు. ఈ మహాజన సభలోనే అదనపు రిజిస్ట్రార్ విచారణ నివేదిక బహిర్గతం చేయనున్నారు. వైఎస్సార్సీపాలనలో కుప్పం రెస్కో పరిధిలో క్విడ్ ప్రోకోతో పాటు పలు అక్రమాలు జరిగాయంటూ సిఎం పిఎ మనోహర్, షణ్ముగం అనే వ్యక్తి గతేడాది సహకార సంఘాల కమీషనర్‌కు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో రాష్ట్ర సహకారసంఘాల కమీషనర్ ఆదేశాలతో అదనపు రిజిస్ట్రార్ శ్రీలక్ష్మి ఈ అంశాలపై విచారణ నిర్వహించారు. కుప్పం రెస్కో ప్రధాన కార్యాలయంలో పలు రికార్డులు స్వాధీనం





కుప్పం రెస్కో ప్రధాన కార్యాలయం

చేసుకుని ఆమె విచారణ చేపట్టారు. దాదాపు నాలుగు పర్యాయాలు ఆమె పలువురు రెస్కో ఉద్యోగులు, ఫిర్యాదుదారులతో విచారణ కొన సాగించి విచారణ అంశాలను ప్రభుత్వానికి, రాష్ట్ర సహకార శాఖ కమీషనర్‌కు, రెస్కో పాలకవర్గం నియామకం వరకు రెస్కో పర్సన్ ఇన్‌చార్జ్‌గా కొనసాగిన జాయింట్ కలెక్టర్‌కు అందజేశారు. మరోపక్క అదేసమయంలో కుప్పం రెస్కోలో విజిలెన్స్ అధికారుల విచారణ సైతం కొనసాగింది. రెస్కో పరిధిలో గతంలో టెండర్లు పిలవకుండానే మెటీరియల్ కొనుగోళ్లు చేయడంతో పాటు సుమారు పదికోట్ల నగదు క్విడ్ ప్రోకో జరిగినట్లు, వీటితో పాటు ఎటువంటి నోటిఫికేషన్ లేకుండా ఉద్యోగాల భర్తీ చేశారని అప ్పట్లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. మరో పక్క రెస్కోలో పనిచేసే ఓ ఉద్యోగి పదకొండు ఇంక్రిమెంట్లు పెట్టుకున్నాడని ఇదివరకే రెస్కో వర్గాలు గుసగుసలాడాయి. కాగా ప్రభుత్వ వాహనం,డీజిల్ నిధులను దుర్వినియోగం చేశారని ఇదివరకే మాజీ ఛైర్మన్‌తో పాటు మరో ఇద్దరిపై కేసులు నమోదైన విషయం విదితమే. ఈనేపథ్యంలో విచారణ అధికారి అందించే నివేదిక ఎలాంటి వాస్తవాలు బయటపెడుతుందోననే ఉత్కంఠత ఏర్పడింది.

### పారిశుద్ధ్యం ప్రశార్థకం

## సీజనల్ రోగాలతో సతమతం

### ఎటు చూసినా చెత్తకుప్పలే: పందుల విహారమే





శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 28 ప్రభాతవార్త

పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న సామెత పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తికి వర్తిస్తుంది. ఓ వైపు వర్షాకాలం తరుముకొస్తుంది. ఇప్పటికే పట్టణంలోని ప్రజలు వైరల్ ఫీవర్లతో తల్లడిల్లుతున్నారు. మున్సిపాలిటి పారిశుద్ధ్యం విషయంలో నిర్లక్ష్యంగా ఉందన్న విమర్శలు చోటు చేసుకున్నాయి. పేరుబడ్డ కాలనీల్లో ఖాళీ స్థలాలుఅ డవుల్లా మారుతున్నాయి.దాంతో పాముల బెడద అధికంగా ఉందని చెబుతున్నారు. శ్రీకాళహస్తి మున్సిపాలిటి ఆర్థికంగా దెబ్బతిన్నది. ఏడాది నుంచి పనులు చేసిన కాంట్రాక్టర్లకు చెల్లింపులు చేయలేని దుస్థితి చోటు చేసుకుంది. నాలుగుమాడావీధుల్లో మున్సిపాలిటితో పాటు దేవస్థానం ఉద్యోగు పారిశుద్ధ్యం పనులు పర్యవేక్షిస్తున్నారు. దాంతో పారిశుద్ధ్యం కొంత మెరుగ్గా కనబడుతఉంది.కానీ వీధుల్లో పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

#### వీధుల్లో నడిరోడ్డుపై చెత్తలు:పందులు

శ్రీకాళహస్తి మున్సిపాలిటిలోని ఏ వీధిలో చూసినా నడిరోడ్డుపై చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి.ముఖ్యంగా హరహరబావి వద్ద మున్సిపల్ పాఠశాల ఉంది. ఈ పాఠశాలకు ఎదురుగుగా నడిరోడ్డుపై చెత్తలు ఆ వీధివారంతో పడేస్తున్నారు.గతంలో మున్సిపల్ ఉద్యోగి తోపుడు బండితో వేకువ జామునుంచి చెత్తలను సేకరించే వారు.కానీ ఎందుకో ప్రస్తుతం అలా జరగటం లేదు.ఈ పరిసరాల్లో పందుల సంచారం అధికంగా ఉంది. ఎస్‌డికె నగర్,మున్సిపల్ పార్కు, చెంచులక్ష్మీ కాలనీ పరిసరాల్లో పందులు విచ్చల విడిగా దర్శనమిస్తున్నాయి. కానీ పట్టించుకునే దిక్కులేదు.

#### శానిటనీ శాఖ ఏం చేస్తుంది?

శ్రీకాళహస్తి మున్సిపాలిటిలో పని చేస్తూ శానిటరీ ఇన్సెపెక్టర్ బాలచంద్ర గుండెపోటుతో మృతి చెందిన నెల దాటింది. అయితే తరువాత అర్హత కల్గిన శానిటరీ ఇన్సెపెక్టర్ మోతీలాల్,మరో శానిటరీ ఇన్సెపెక్టర్ ఉన్నారు. అయితే మోతీలాల్ సీనియర్. కానీ ఎందుకో అధికారులు బాధ్యతను అప్పగించటంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు.దాంతో కార్మికుల చేత పనులు చేయించే సత్తా గల్గిన అధికారి లేనందువల్ల పారిశుధ్య పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది.దాంతో వీధుల్లో పర్యవేక్షణే కరువైంది.ఇప్పటికైనా అధికారులు వీధుల్లో పారిశుధ్యంపై స్పందించి పర్యవేక్షించాల్సి ఉంది. ఇప్పటికే రోగాలతో తల్లడిల్లుతున్న జనం కోలుకోలేని పరిస్థితి దాపురించకముందే మెల్కొవాల్సి ఉంది.

## సచివాలయ ఎఎన్ఎంల బదిలీల్లో అక్రమాలు

### - కలెక్టర్‌కు డిఎంహెచ్ఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ సరెండర్



చిత్తూరు, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త:

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో 3 నెలల క్రితం జరిగిన వార్డు, గ్రామ సచివాలయ ఎఎన్ఎంల బదిలీల్లో భారీ అక్రమాలు జరిగినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధారాణి గుర్తించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో విధులు నిర్వహించే ఓ సీనియర్ అసిస్టెంట్ వార్డు, గ్రామ సచివాలయ ఎఎన్ఎంల నుండి వారికి అనుకూలమైన ప్రదేశాల్లో పోస్టింగ్స్ ఇప్పించడానికి వారి నుండి భారీ మొత్తంలో వసూలు చేసినట్లు ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ మేరకు పలువురు గ్రామ, వార్డు సచివాలయ ఎఎన్ఎంలు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనిపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి అంతర్గతంగా విచారణ నిర్వహించి అక్రమాలు జరిగిందని నిర్ధారించినట్లు తెలిసింది. ఈ విషయంపై సీనియర్ అసిస్టెంట్ నుండి వివరణ కోరగా వార్డు, గ్రామ సచివాలయ ఎఎన్ఎంల బదిలీల్లో తానొక్కడే అక్రమాలకు పాల్పడలేదని, కార్యాలయంలో చాలా మంది అక్రమాలకు పాల్పడ్డారని వారిపై సైతం చర్యలు తీసుకోవాలని ఎదురు ప్రశ్నించడంలో డిఎంహెచ్ఓ ఖంగు తినాల్సివచ్చింది. ఈ విషయంను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కలెక్టర్ సుమిత్‌కుమార్ దృష్టికి తీసుకెళ్ళడంతో ఆ సీనియర్ అసిస్టెంట్‌ను తనకు సరెండర్ చేయాలని ఆదేశించినట్లు తెలిసింది. ఈ మేరకు డిఎంహెచ్ఓ డాక్టర్ సుధారాణా ఆ సీనియర్ అసిస్టెంట్‌ను కలెక్టర్‌కు సరెండర్ చేయడంతో ఆ సీనియర్ అసిస్టెంట్ ప్రస్తుతం కలెక్టరేట్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు.

## కాణిపాకంలో వైభవంగా గరుడసేవ



కాణిపాకం, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీశ్రీదేవి భూదేవి పెరిందేవి సయిత వరదరాజసా ్వమి ఆలయంలో ఆదివారం రాత్రి గరుడసేవను అత్యంత వైశవోపేతంగా నిర్వహించారు. కలియుగ వైకుంఠం తిరుమలలో గరుడసేవ జరిగే సమయంలో శ్రీవరదరాజస్వామి ఆలయంలో స్వామివారికి గరుడసేవను నిర్వహించడం ఆనవాయితీ. ఈకార్యక్రమానికి కాణిపాకంకు చెందిన యాదవ వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈమేరకు ఆలయంలో పగలు స్వామివారి మూలవిరాట్‌కు అర్చకులు వేపండితుల మంత్రోచ్ఛారణ నడుమ ప్రత్యేకఅభిషేకాలు నిర్వహించి,అలంకరించి పూజలు చేసి దూపదీప నైవేద్యాలను సమరి ్పంచారు.అలాగే ఆలయ మండపంలో ప్రత్యేక హోమాలను నిర్వహించారు. తిరిగి రాత్రి స్వామి,అమ్మవార్ల ఉత్సవమూర్తులను అలంకరించి ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం తన కిష్టమైన అలంకరించిన గరుడవాహనంపై వుంచి మంగళవాయిద్యాల నడుమ గ్రామ పురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు.ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, ఉత్సవ ఉభయదారులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## తరలిపోతున్న ఎర్రబంగారం!

### అసైన్మెంట్ భూముల్లో లోతైన గుంటలు పట్టించుకోని సంబంధిత అధికారులు

దొరవారి సత్రం ,సెప్టెంబర్ 28 ప్రభాతవార్త:

తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండల పరిధిలోని అనేపూడి పంచాయతీలో గ్రావెల్ దాందా యదేచ్ఛగా జరుగుతోంది. అక్రమంగా ఎర్ర బంగారం రాత్రిపూట సుమారు 20 టిప్పులతో ఆర్ అండ్ బి రోడ్లపై భారీ టిప్పర్లు పరుగులు తీస్తున్నాయి స్థానిక గ్రామస్తులు రైతులు ఈ దందాను అడ్డుకోవాలని వారి గోడు ఫిర్యాదులు రూపంలో వినిపిస్తున్నాయి. ఇవే అధికారులు కంటపడడం లేదు. నాయకులకు వినబడడం లేదు అక్రమంగా గ్రావెల్ తరలిపోతున్న పోలీసులు కానీ, సంబంధిత అధికారులు పట్టించు కోవడం లేదు. దొరవారిసత్రం మండలంలోని ఆనెపుడు పంచాయతీలు అసైన్మెంట్ భూములు లక్ష్యంగా చేసుకొని గ్రావెల్ దందాకు శ్రీకారం చుట్టారు కొంతమంది అక్రమార్కులు. ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా తవ్వకాలు జరుపుతున్న అక్రమార్కుని అడ్డుకోవాల్సిన అధికారులే వారికి అండగా ఉంటూ కొమ్ముకాస్తున్నారని ఆరోపిస్తున్నారు పగలు రాత్రి తేడా లేకుండా ప్రభుత్వ అసైన్మెంట్ భూముల్లో భారీ వాహనాలతో లోతైన గుంటలు తవ్వి ఎర్ర బంగారాన్ని జిల్లాలు దాటి రాష్ట్రాలకు తరలిస్తున్నారు. తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండలంలో రాజ్యమేలుతున్న సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు.



ఈ గ్రావెల్ మాఫియా దందాకు స్థానిక అధికారులు, నాయకుల అండదండలు ఉన్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ అసైన్మెంట్ భూముల్లో సుమారు 20 నుంచి 30 అడుగుల లోతుతో గ్రావిల్ ను తవ్వేస్తున్నారు. పగలు రాత్రి తేడా లేకుండా హిటాచ్ ద్వారా ఎర్ర బంగారం తరలి వెళ్ళిపోతుంది ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

– కలెక్టర్ సుమిత్‌కుమార్

**చిత్తూరు, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త:** ప్రజా సమస్యలను పరిష్కరించడానికి కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో సోమవారం ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు అందరు హాజరు కావాలని, అలాగే నియోజకవర్గ, మండల స్థాయిల్లో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేది కార్యక్రమాలకు సంబంధిత అధికారులు విధిగా హాజరై ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించి వాటిని పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు.

## మహిళా ఆరోగ్యం పై శ్రద్ధ వహించాలి



**కల్లూరు, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త** మహిళందరూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని నిర్లక్ష్యం చూపరాదని, తరచుగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని పుంగనూరు నియోజకవర్గ ఇన్చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. పులిచెర్ల మండలం దేవళంపేట గ్రామంలో నిర్వహించిన "స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్" సమావేశంలో పాల్గొన్న ఆయన గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడుతూ కుటుంబంలో కీలకమైన మహిళలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఆ కుటుంబం శక్తివంతంగా ఉంటుందన్నారు. ప్రమాదకరంగా మారుతున్న రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు కనీసం ఆరు నెలలకు ఒకసారైనా చేయించుకోవాలని హితవు పలికారు. వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఈ వైద్య శిబిరాల ద్వారా ఇప్పటికే పులిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పదిహేను వందల మందికి పైగా చికిత్సలు పొందారని, వారిలో నూతనంగా రక్తపోటు మరియు మధుమేహ బాధితుల్ని గుర్తించామన్నారు. తహసిల్దార్ జయసింహ మాట్లాడుతూ ఖరీదైన వైద్యాన్ని మారుమూల గ్రామాల్లోని పేదప్రజలకు చేరువ చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇలాంటి వైద్య ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తోందన్నారు. అనంతరం చల్లా రామచంద్రా రెడ్డి వైద్య శిబిరాన్ని సందర్శించి ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. అంగన్వాడి సూపర్వైజర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అంగన్వాడి కార్యకర్తలు పోషకాహార ప్రదర్శనశాలను ఏర్పాటు చేసి గ్రామాల్లో దొరికే ఆహార పదార్థాల్లోని పోషక విలువలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యురాలు డాక్టర్ అపర్ణ, నాయకులు లెక్కల ధనుంజయ నాయుడు, కుమార్ రెడ్డి, మహేష్, లోకేష్, వెంకట ముని నాయుడు, నారాయణ స్వామి నాయుడు, రాజేష్, మురళి, యర్రయ్య, రమేష్, నజీర్, ఆరోగ్య సిబ్బంది శ్రీదేవి, చంద్రయ్య, ప్రమీల, పురుషోత్తం, జబీన్ తాజ్, స్వర్ణలత, సుమిత్ర, పంచాయతీ కార్యదర్శి సంతోష్ అంగన్వాడి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## మధుర శ్రీ మీనాక్షి దేవిగా శ్రీ చౌడేశ్వరి దర్శనం



**పుంగనూరు, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త** విజయదశమి ఉత్సవాలలో భాగంగా ఆదివారం శక్తిరూపిణి శ్రీ మధుర మీనాక్షి అమ్మవారి అలంకరణలో శ్రీ చౌడేశ్వరి దేవి దర్శనమిచ్చారు. ఆలయ వ్యవస్థాపకులు శ్రీ వేణుగోపాల్ రెడ్డి, ఉషశ్రీ దంపతులు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో ఆదిత్య హృదయ హోమము, ఆదిత్య నామావళి నిర్వహించారు. అనంతరం అమ్మవారి మూలవిరాట్ కు పంచ తీర్థాలు పంచగవ్యాలతో అభిషేకం నిర్వహించారు. అమ్మవారిని శ్రీమధుర మీనాక్షి రూపంలో అలంకరించి మహా మంగళహారతి నిర్వహించారు. భక్తులకు ఎన్వీఆర్ ట్రస్ట్ కార్యదర్శి శివకుమార్ రెడ్డి సభ్యుల సారథ్యంలో అన్నదానం నిర్వహించారు. సాయంత్రం ఎన్వీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఎన్వీఆర్ వేదిక వద్ద ఈటీవీ జబర్దస్త్ టీం వినోదిని సభ్యులచే వినోదాత్మకమైన కార్యక్రమం ఏర్పాటు చేశారు. టీం సభ్యులు శాంత కుమార్, సునామి సుధాకర్, నెమలి రాజు మొదలైన వారిచే పలు స్కిట్లు ప్రదర్శించబడ్డాయి.

## అలంకారాలతో అకట్టుకున్న శక్తి ఆలయాలు: భక్తుల సంబరాలు

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో దసరా మహోత్సవాలు వైభవంగా











నిర్వహిస్తున్నారు. వివిధ అలంకారాలలో అమ్మవార్లను దర్శించుకుంటున్న భక్తులు పునీతులౌతున్నారు. ఆదివారం శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారికి 'కాళరాత్రి అలంకారం' అద్భుతంగా నిర్వహించారు. కనకాచలంపై వెలసిన దుర్గమ్మకు లలిత త్రిపురసుందరీ దేవి అలంకారం జరిపారు. అలంకారాన్ని తులసీ శర్మ జరిపారు. ఏడుగంగమ్మల ఆలయంలో వెలసిన అమ్మవారికి కాళరాత్రి అలంకారం జరిపారు. బిపి ఆగ్రహారంలోని చిన్నగంగమ్మకు జ్ఞాన ప్రసూనాంబ అలంకారం జరిపారు. పెద్దగంగమ్మకు మీనాక్షి దేవి అలంకారం జరిపారు. బజారువీధిలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారికి కల్ అలగర్ పెరుమాళ్ళస్వామి అలంకారం జరిపారు. భాస్కరపేటలోని చాముండేశ్వరి దేవికి లలిత త్రిపుర సుందరి దేవీ అలంకారం, బహాదూరుపేటలోని నల్లగంమ్మకు శ్రీ రాజరాజేశ్వరి దేవి అలంకారం బహాదూరుపేటలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారికి గర్భరక్షాంబికా దేవి అలంకారం జరిపారు. ఆదివారం ఆలయాలు మహిళా భక్తులు భవాని భక్తులతో కిట కిట లాడాయి. ముత్యాలమ్మగుడిలో భక్తులు విశేష సంఖ్యలో దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

## గుమ్మడికి టూరిజం ఎక్సలెంట్ అవార్డు అందించిన సిఎం

శ్రీకాళహస్తి హస్తకళలకు గుర్తింపు



**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త** శ్రీకాళహస్తికి చెందిన హస్తకళలను ప్రోత్సహిస్తూ కళాకారులకు చేయూత ఇస్తున్న గుమ్మడి దశరధాచ్చారికి అర్ట్స్ అండ్ కల్చర్ ఎక్సలెంట్ అవార్డును రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు అందించారు. ఈ మేరకు ఇక్కడకు సమాచారం అందింది. శ్రీకాళహస్తిలో సుమారు 40 సంవత్సరాలుగా హస్తకళలను ప్రోత్సహిస్తున్న సేవలకు గుర్తింపు ఇచ్చారని అవార్డు గ్రహీత గుమ్మడి దశరధాచ్చారి ఆదివారం ఇక్కడ వివరించారు. దశరధాచ్చారి కుటుంబం ఆది నుంచి దారుశిల్పులుగా ఉన్నారు. వారి కుటుంబంలో జాతీయ అవార్డును కూడా అందుకున్నారు. దశరధాచ్చారి 1995లో కళాసృష్టిని అనే స్వచ్ఛంద సేవా సంస్థను స్థాపించి రాష్ట్రంలో ఉన్న దోల్‌బొమ్మలు, ఉదయగిరి కత్రీతయారి, ఫ్లోర్ మ్యాట్లు, బీడ్స్ జ్యూవలరి, కాగితగుజ్జు బొమ్మలు, కలంకారి, కొయ్యలక్కపిడతలు, రాజారాణి బొమ్మలు, దారు శిల్పాలకు సంబంధించి కళాకారులను ప్రోత్సహించారు. వారు తయారు చేసిన కళాఖండాలను చేనేత జౌళి శాఖ కమిషనర్ సహకారంతో అనేక కార్యక్రమాలను ఎగ్జిబీషన్లలో అవకాశాలను సాదించారు. వీటితో పాటు కళాకారులను రాష్ట్ర, జాతీయస్థాయి అవార్డులకు ప్రోత్సహించారు. వీరి కుటుంబంలో ముగ్గురుజాతీయ అవార్డును అందుకోవటం విశేషం. ఆయనసేవలను గుర్తించిన టూరిజం శాఖ ఆయనను ఎక్సలెన్సి అవార్డుకు ఎంపిక చేసారు. ఈ అవార్డును ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు చేతుల మీదుగా తీసుకున్నారు. ఆయన్ను పలువురు స్థానికులు సత్కరించారు. అభినందించారు.

## వాసవి అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎంఎల్ఏ



**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త** శ్రీకాళహస్తిలోని బజారువీధిలో వెలసిన శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో జరుగుతున్న దసరా ఉత్సవాల్లో ఆదివారం మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి వారి సహచరులు అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ ఛైర్మెన్ జూలుగంటి మురళి మోహన్ గుప్తా, గౌరవాధ్యక్షులు ఎంఆర్‌వి సురేంద్రబాబు(చిట్టి) పాలకమండలి సభ్యులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కమిటి నిర్వాహకులు మాజీ శాసనసభ్యుని దుశ్శాలువతో సత్కరించారు. అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందించారు. ఆయనతో పాటు మాజీ శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ఉన్నారు. ఈకార్యక్రమాల్లో ఆశాకిరణ్, సూరాగారి సురేష్, మున్నారాయల్, బుల్లెట్ జైశ్యాం రాయల్, జివికే రెడ్డి, యశ్వంత్, మురళి, లోకేష్, ముద్దమూడి రవి, అంకయ్య, మునిరాజా తదితరులున్నారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం : సన్మానం



**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త** శ్రీకాళహస్తిలోని హరహరబావి వద్ద ఉన్న మున్సిపల్ పాఠశాలలో ఆదివారం పూర్వవిద్యార్థు సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 1995-96లో 7వ తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం కలసినారు. అ సందర్భంగా గత స్మృతులను స్మరించుకుంటూ సంతోషంగా గడిపారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయులు సుబ్బయ్యను సత్కరించారు. ఈ సమావేశంలో నాటి విద్యార్థులు నేటి ఉద్యోగులు అధికారులు మంచి స్థానంలో ఉన్న వారు కలసి తమ అనుభవాలను నాటి జ్ఞాపకాలను స్మరించుకున్నారు. తనను గుర్తుపెట్టుకొని సత్కరించిన సహచరులను విశ్రాంత ప్రధానోపాధ్యాయులు సుబ్బయ్య ధన్యవాదాలు తెలిపారు.

## బిజెపి జిల్లా అధ్యక్షుడిచే పతాకావిష్కరణ



**శాంతిపురం, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త** భారతీయ జనతా పార్టీ పతాకాన్ని శాంతిపురంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్ నాయుడు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయనమాట్లాడుతూ ప్రధాని మోడీ నేతృత్వంలో భారతదేశం అభివృద్ధిలో ముందుకు సాగుతోందన్నారు. అ ంతకుముందు స్థానిక ఐటిఐకళాశాలలో ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. 128మందికి వైద్య పరీక్షలు జరిపారు. కార్య క్రమంలో నేతలు విజయ్‌కుమార్, కాశీనాథ్, మండల అధ్యక్షుడు గజేంద్రకుమార్, మంజునాథ్, నాగరాజు పాల్గొన్నారు.

## వి.కోటలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం



**వి.కోట, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త** ప్రపంచ ఆయుర్వేద దినోత్సవంసందర్భంగాస్థానిక సుప్రభాత్ సుఖాయు ఆయుర్వేద ఆస్పత్రి వారిచే టిటిడి కళ్యాణమండపంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సుమారు 170 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డా॥శివ సాహితి, సిబ్బంది పాల్గొన్నారు.

## వరసిద్దుని సేవలో ఉత్తరాఖండ్, ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు



**కాణిపాకం, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త:** ఉత్తరాఖండ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల హైకోర్టు న్యాయమూర్తులు ఆదివారం వేర్వేరుగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఈమేరకు ఉత్తరాఖండ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అలో క్ మహేర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావులు వేర్వేరుగా కుటుంబసమేతంగా కాణిపాకం స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ రాజగోపుం వద్ద ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. వారి వెంట ఆలయ, సూపరెడెంట్ వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజినాయుడు, కాణిపాకం ఎస్సై నరసింహులు, చిత్తూరు కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఏపీఐఐసీ డైరక్టర్ మహేష్‌కు ఘన సన్మానం



**కాణిపాకం, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త:** ఏపీఐఐసి డైరక్టర్‌గా నియమితులైన మైఫోర్స్ మహేష్‌ను ఆదివారం పూతలపట్టు నియోజకవర్గ జనసేన నాయకులు ఘనంగా సన్మానించారు. మదనపల్లెలోని ఎంజీ గ్రాండ్ ఫంక్షన్ హాలునందు ఆదివారం జరిగిన కార్యక్రమంలో మహేష్‌ను ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా జిల్లా జనసేన నాయకులు వమేష్ స్వేరో మాట్లాడుతూ ఎన్నో ఏళ్ళుగా జనసేన పార్టీకి నిస్వార్థంగా సేవ చేస్తున్న జనసేన పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైపోర్స్ మహేష్‌ను ఏపీఐఐసి డైరక్టర్‌గా నియమించడం శుభసూచకమన్నారు. భవిష్యత్తులో ఉమ్మడి చిత్తూరు జిల్లా. పరిసర జిల్లాలు పారిశ్రామికంగా అభివృద్ధి దిశగా అడుగులు వేయడానికి అవకాశముంటుందని తెలిపారు. ఈకార్యక్రమంలో చిత్తూరు జిల్లా కార్యదర్శి ఏపీ శివయ్య, జిల్లా నాయకులు మహేష్ స్వేరో, యాదమరి మండల అధ్యక్ష, కార్యదర్శులు కుమార్, వేముల పవన్, తవణంపల్లె మండల ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు(చిన్న), అజిత్, శ్రీరాములు, అనిల్‌కుమార్, ప్రభాకర్, ప్రసాద్, త్రినాధ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉనికి కాపాడుకోవడం కోసం వైకాపా విమర్శలు

– రాష్ట్ర తెలుగుదేశం అధికార ప్రతినిధి వెంకిటీల సురేంద్రకుమార్



**చిత్తూరు, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త:** రాష్ట్రంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తన ఉనికిని కాపాడుకోవడం కోసం కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేస్తోందని రాష్ట్ర తెలుగుదేశం అధికార ప్రతినిధి వెంకిటీల సురేంద్రకుమార్ ఆరోపించారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పుంగనూరులో జరిగిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమావేశంలో వైకాపా నాయకులు సజ్జల రామకృష్ణారెడ్డి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులను మభ్యపెట్టడం కోసం, పార్టీ ఉనికిని కాపాడుకోవడం కోసం సిఎం నారా చంద్రబాబునాయుడు, కూటమి ప్రభుత్వంపై ఆరోపణలు చేశారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అడ్డగోలుగా పాలన సాగిస్తోందని, ఓట్లను దొంగలించడం, వ్యవస్థలను మేనేజ్ చేయడం సిఎం చంద్రబాబునాయుడుకు తెలిసినంతగా మరెవరికి తెలియని చెప్పడం దారుణమన్నారు.

**చిత్తూరులో అభివృద్ధి పరుగులు** తెలుగుదేశం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు ఆధ్వర్యంలో చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు తీస్తోందని రాష్ట్ర తెలుగుదేశం అధికార ప్రతినిధి వెంకిటీల సురేంద్రకుమార్ పేర్కొన్నారు. చిత్తూరు ఎమ్మెల్యే ప్రజలకు అందుబాటులో వుండి తన సొంత నిధులను సైతం ప్రజా సంక్షేమానికి ఖర్చు చేస్తూ ప్రజల మనిషిగా మన్ననలు పొందుతున్నారన్నారు. వైకాపా గత ఐదేళ్ళలో చిత్తూరులో చేపట్టని అభివృద్ధి తెలుగుదేశం ప్రభుత్వం కేవలం 15 నెలల్లో చేపట్టి పూర్తి చేసిందన్నారు. జిల్లా తెలుగుదేశం కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్ పాల్గొన్నారు.

## యువకుడు ఆత్మహత్య



**చిత్తూరు, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త:** చిత్తూరు టుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గిరింపేట బాలాజీ నగర్‌లోని తన పాత ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని దుర్గాప్రసాద్(20) ఆత్మహత్య చేసుకున్నాడు. చిత్తూరు టుటౌన్ పోలీసులు వెల్లడించిన వివరాల మేరకు చిత్తూరు ప్రశాంత్‌నగర్ వైఎస్ఆర్ కాలనీలో ఎస్ మేరీ లావణ్య, ఎం.సెల్వంలు భార్య భర్తలు. వీరి కుమారుడు దుర్గాప్రసాద్. వీరు ప్రశాంత్‌నగర్‌లోని వైఎస్ఆర్ కాలనీలో నివాసం వుంటున్నప్పటికీ గత రెండు నెలలుగా గంగనపల్లికి వెళ్ళి వుంటున్నారు. ఈ క్రమంలో వీరికి గిరింపేట బాలాజీ నగర్‌లో ఒక పాత ఇల్లు వుండేది. దుర్గాప్రసాద్ తండ్రి సెల్వం మద్యంకు అలవాటు పడి కుటుంబంను సరిగా చూసుకోకపోవడం, మరోవైపు దుర్గాప్రసాద్ ఇటీవల కాలంలో మొబైల్ గేమ్స్ ఎక్కువగా ఆడుతూ మానసికంగా ఒత్తిడికి గురయ్యేవాడు. దుర్గాప్రసాద్ గత మూడు రోజులుగా తనకు బతకాలని లేదని, చనిపోతానని స్నేహితులు, సన్నిహితుల వద్ద చెప్తుండేవాడు. ఈ క్రమంలో దుర్గాప్రసాద్ ఆదివారం ఉదయం 6 గంటలకు గంగనపల్లిలో తాము నివాసం వుంటున్న ఇంటి నుండి మోటర్ బైక్‌పై బయలుదేరి గిరింపేట బాలాజీ నగర్‌లోని పాత ఇంటి వద్దకు చేరుకుని ఇంట్లోనే సీలింగ్ ఫ్యానుకు మంచం గుడ్డ కట్టుకుని ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం వెళ్ళిన కుమారుడు రాలేదని దుర్గాప్రసాద్ కోసం వెతుకులాట ప్రారంభించి చివరికి గిరింపేట బాలాజీ నగర్‌లోని పాత ఇంటి వద్దకు చేరుకుని పరిశీలించగా దుర్గాప్రసాద్ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తేలింది. ఈ మేరకు ఉరి వేసుకుని వున్న దుర్గాప్రసాద్ శరీరంను కిందికి దింపి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకెళ్ళగా డాక్టర్లు దుర్గాప్రసాద్ అప్పటికే మృతి చెందాడని స్పష్టం చేశారు. ఈ మేరకు టుటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పిఎస్ చంద్రశేఖర్

**చిత్తూరు, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త:** జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పిఎస్ చంద్రశేఖర్ ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చిత్తూరు ఎల్‌జిబి టవర్స్ ఫంక్షన్ హాలులో ఆదివారం ఎపి సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ చిత్తూరు జిల్లా సర్వసభ్య సమావేశం, నూతన కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో ఉపాధ్యక్షులుగా సిద్ధు, కార్యదర్శిగా మల్లేశ్వరి, సంయుక్త కార్యదర్శిగా కె.రుతిక్, కోశాధికారిగా జి.దేవానంద్, కార్యవర్గ సభ్యులుగా రమేష్, కుసుమలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కన్వీనర్ కెవి రమణ(శ్రీకాకుళం), ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎన్.నరసింమారెడ్డి(గుంటూరు), రాష్ట్ర సాఫ్ట్‌బాల్ కార్యవర్గ సభ్యులు శ్రీనివాసరావు(ఒంగోలు), సురేష్‌బాబు(రాజమండ్రి)లు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మాజీ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు, మాజీ టౌన్ బ్యాంకు ఛైర్మన్ పి.షణ్ముగం హాజరయ్యారు.

జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దడానికి కృషిజిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తానని మాజీ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు, మాజీ చిత్తూరు టౌన్ బ్యాంకు ఛైర్మన్ పి.షణ్ముగం అన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల పరిశీలకులు, ఎన్నికల అధికారులను జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ తరపున సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పిడి, పిఇటి అసోసియేషన్ అధ్యక్షులు రవీందర్‌రెడ్డి, క్రీడా అసోసియేషన్‌ల నాయకులు కె.కృష్ణ, సిరాజ్, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి బాబు, ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన 120 మంది పిడి, పిఇటిలు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ఐవిఆర్‌ఎఫ్ చేసుకునేవారికి సిఎంఆర్‌ఎఫ్ కింద సాయం

– ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్



**కుప్పం, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త** సంతానం లేని దంపతులు ఐవిఆర్‌ఎఫ్ విధానంలో చికిత్స పొందితే వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సహకారం అందిస్తామని ప్రభుత్వ విప్, కడ పిఎసి ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. ఆదివారం కుప్పంలోని శ్రీ ప్రియ నర్సింగ్‌హోంలో చెన్నై ఫర్టిలిటీ సెంటర్ (సిఎఫ్‌సి)అధినేత, జిడి నెల్లూరు ఎమ్మెల్యే థామస్, ఆస్పత్రి ఛైర్మన్ డా॥ సుధీర్‌తో కలసి ఉచిత సంతాన వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో పిల్లలు లేని తల్లిదండ్రుల ఇబ్బందులు అందరికీ తెలుసన్నారు. జనాభా పెరుగుదలను సిఎం చంద్రబాబునాయుడుప్రోత్సహిస్తున్నారన్నారు. ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తారన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబు, కమీషనర్ శ్రీనివాసరావు, ఎపిఐఐసిడైరెక్టర్ ప్రేమ్‌కుమార్, టిడిపి మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, మాజీ ఎంపిపి డా॥ వెంకటేష్, కౌన్సిలర్లు జిమ్‌దాము, జాకీర్, సోమశేఖర్, కడ సభ్యుడు రామచంద్ర, ఆర్ఆర్ రవి, నాను, డా॥ ప్రశాంత్‌గౌడ తదితరులు పాల్గొన్నారు.

## గోశాల నిర్వహణకు రూ. లక్ష విరాళం



**బోయకొండ(చౌడేపల్లి), సెప్టెంబర్ 28 ప్రభాతవార్త** శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న గోశాలకు దాత రూ. లక్ష విరాళాన్నందించాడు. ఈమేరకు ఆయల ఇఒ, ఉపకమీషనర్ ఏకాంబరంకు దాత బెంగళూరుకు చెందిన రంజిత్ రూ.లక్ష నగదునందించాడు. దాతతోపాటు కుటుంబ సభ్యులకు అమ్మవారి దర్శన భాగ్యం కల్పించి, అమ్మవారి పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు.

## అమ్మవార్ల వేషధారణలో అలరించిన చిన్నారులు



**చౌడేపల్లి, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త** శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయంలో దసరా మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈక్రమంలో కలికిరికి చెందిన చిన్నారులు కీర్తిక, లేఖప్రియలు అమ్మవారి వేషధారణ వేశారు. త్రిశూలం, అమ్మవారి ఖడ్గంతో చిన్నారులు ఆలయంలో అందరి దృష్టిని ఆకర్షించారు. మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వారిని అభినందించారు. దేవస్థానంలో భక్తులందరూ అమ్మవారి స్వరూపాల్లో వున్న వారిద్దరినీ ఆసక్తిగా చూసారు.

## మహాచండీగా వైష్ణవీమాత



**చౌడేపల్లి, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త** పుదిపట్ల స్వయంభు వైష్ణవీదేవి ఆలయంలో జరుగుతున్న నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు మహాచండీగా అలరించింది. ఉదయాన్నే ఆలయంలో ప్రధానార్చకురాలు శ్రావణి ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు జరిగాయి. అమ్మవారికి పంచామృతాభిషేకం, అలంకరణ గావించారు. హైదరాబాదుకు చెందిన ఫణికుమార్, సంధ్య, పుంగనూరు మల్లికార్జునరెడ్డి, సత్యకుమారి, రామకృష్ణారెడ్డి, రూపకుమారి, దామోధర్, నాగేశ్వరమ్మ, పుదిపట్ల మునివెంకట్రెడ్డి, నాగమ్మలు ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయ నిర్మాణకర్త వినోద్‌కుమార్‌రెడ్డి వసతులు సమకూర్చారు.

## నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

– కడ పి.డి.వికాస్ మర్మత్



**కుప్పం, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త** కుప్పం నియోజకవర్గ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్నిసోమవారం కుప్పం మండల కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ తెలిపారు. ఉదయం 10గంటలనుంచి మధ్యాహ్నం 1గంటదాకా ఈకార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజల సమస్యలునేరుగా తెలుసుకుని వినతులు స్వీకరించడం జరుగుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగంచేసుకోవాలని కోరారు.

## దివ్యాంగుల సంక్షేమ సంఘం సమావేశం



**కుప్పం, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త** నియోజకవర్గ దివ్యాంగులసంక్షేమ సంఘం సమావేశం ఆదివారం కుప్పం రాజావారి పార్కులో జరిగింది. ఈసందర్భంగా సభ్యులు మాట్లాడుతూ కుప్పం పరిధిలో దివ్యాంగులకు కార్యాలయం ఏర్పాటు, కమ్యూనిటీభవనం నిర్మించాలని నిర్ణయించారు. అర్హులైన దివ్యాంగులకు కాలనీగృహాలు మంజూరు చేయాలని అలాగే త్రిచక్ర వాహనాలు అందించడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించాలని పేర్కొన్నారు. సమావేశంలో సంఘ నాయకులు నారాయణప్ప, రామచంద్రప్ప, అల్తాఫ్, కుమారి, పూర్ణిమ, సరస్వతమ్మ, కేశవ, మురళి పాల్గొన్నారు.

## పిహెచ్‌సి వైద్యుల సమస్యలు పరిష్కరించాలి



**కుప్పం, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త** ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కుప్పం నియోజకవర్గ పరిధిలోని పిహెచ్‌సిల్లో పనిచేసే వైద్యులు కడ పి.డి.వికాస్ మర్మత్‌కు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇన్ సర్వీస్ పిజి కోటా పునరుద్ధరించాలని, టైమ్‌బౌండ్‌ప్రమోషన్ల అమలు చేయాలన్నారు. నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలన్నారు. అలాగే ఖచ్చితమైన పనిగంటలు, వైద్యులకు జాబ్ చార్ట్ అమలు చేయాలన్నారు. అనధికార వ్యక్తులు పిహెచ్‌సిల తనిఖీ చేయకుండా తగు ఆదేశాలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం వెంటనే తమ సమస్యలు పరిష్కరించాలని లేకుంటే నిరవధిక సమ్మెకు దిగుతామని వినతిపత్రంలో పేర్కొన్నారు.

## నేతల చొరవతో కార్యకర్తకు అత్యవసర వైద్యం



**కుప్పం, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త** స్థానిక కుమ్మరివీధికి చెందిన తెదేపా కార్యకర్తకు తెదేపా ప్రజాప్రతినిధులు స్పందించి అత్యవసర చికిత్స అందించడంతో అతను కోలుకుంటున్నాడు. రవి అనేకార్యకర్త గతకొంతకాలంగా అనారోగ్యంతో బాధపడేవాడు. విషయాన్నికుటుంబీకులు క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నన్‌కు తెలియజేయగా ఆయన జననాయకుడు పోర్టల్‌లో దరఖాస్తుచేయడంతో పాటుప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్‌కు తెలిపారు. రవికి తిరుపతి స్విమ్స్‌లో చికిత్సకు డా॥ కంచర్ల సూచించారు. అలాగే మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు కూడా స్విమ్స్ వైద్యులను సంప్రదించారు. అక్కడవైద్యులు రవికి తలలో గడ్డ ఉన్నట్లుగుర్తించి అత్యవసర శస్త్ర చికిత్స చేశారు. దీంతో రవి కుటుంబీకులు సిఎం చంద్రబాబునాయుడు, నేతలకు కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యారంగం బలోపేతానికి ప్రభుత్వం కృషి - మాజీ ఎమ్మెల్సీ గౌనివారి

**శాంతిపురం, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త** రాష్ట్రంలో విద్యారంగం బలోపేతానికి సిఎం చంద్రబాబునాయుడు, డిసిఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నట్లు మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం శాంతిపురంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలు మరో నాలుగువందల కోట్లు విడుదల చేసిందన్నారు. గత వైకాపా ప్రభుత్వం నాలుగువేల కోట్ల బకాయిలు పెట్టిందని విమర్శించారు. ఇప్పటిదాకా కూటమిప్రభుత్వం 1600 కోట్లు చెల్లించిందన్నారు. మెగా డిఎస్సీ మెగా హిట్ అయిందన్నారు. ఏటా కూటమి ప్రభుత్వం డిఎస్సీ నిర్వహణ చేస్తామని ప్రకటించిందన్నారు. తెదేపా హయాంలోనే అత్యధిక డిఎస్సీలునిర్వహించినట్లు చెప్పారు.

## ప్రభుత్వ విప్‌ను కలసిన నూతన అధ్యక్షుడు ఉదయ్



**శాంతిపురం, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త** శాంతిపురం మండల నూతన టిడిపి అధ్యక్షుడిగా ఎంపికైన ఉదయ్‌కుమార్ ఆదివారం కుప్పంలో ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్‌నుమర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆయన ఉదయ్‌ను అభినందించి మండలంలో పార్టీ బలోపేతానికి మరింత చొరవ చూపాలని సూచించారు. కార్యక్రమంలో నేతలు జనార్ధనరెడ్డి, మణి, ఎల్.జయరాంరెడ్డి, నామాలప్ప, ఆంజనేయరెడ్డి, చంద్ర, నాగరాజు, హరినాథరెడ్డి, రాజారెడ్డి, గిరి, పెద్దన్న, శేఖర్ పాల్గొన్నారు.

## ఇసుక అక్రమరవాణాపై రెవెన్యూ కొరడా



**శ్రీకాళహస్తిరూరల్, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి నియోజకవర్గం నుంచి ప్రవహిస్తున్న స్వర్ణముఖి పరివాహక ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక రవాణాకు రెవెన్యూశాఖ చెక్ పెట్టింది. ఇసుక అక్రమంగా తరలించకుండా ట్రెంచ్‌లు తవ్వారు. ఈ నేపథ్యంలో మండల రెవెన్యూ అధికారి భార్గవి సారథ్యంలో ఆదివారం కొత్త వీరాపురం–మోదుగుల పాళెం మధ్య స్వర్ణముఖి నది ప్రవహిస్తుంది. ఇక్కడ నుంచి అక్రమంగా ఇసుక తరలించకుండా చర్యలు చేపట్టారు. స్వర్ణముఖి నది నుంచి ఇసుకను ఏ రాజకీయ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ అనుచరులు విచ్చలవిడిగా ఇసుక దందాను సాగిస్తున్నట్లు విమర్శలు చోటు చేసుకున్నాయి. గత కొన్ని నెలలుగా ఇక్కడ నుంచి ఇసుకను ఒక చోట నిల్వ చేసి అక్కడ నుంచి తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో నది సమీపం నుంచి ట్రెంచ్ ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమాల్లో తహశీల్దార్ భార్గవి విఆర్‌ఓ శ్రీవిద్య, విఆర్ఏలు జగదీష్, నాగరాజులు ప్రత్యేకంగా జెసిబిలు ఏర్పాటు చేసి ట్రెంచ్‌లు తవ్వి అడ్డుకట్ట వేసినట్లు తహశీల్దార్ భార్గవి వివరించారు.

## పవన్‌ను విమర్శించే అర్హత బియ్యపుకు ఉందా?

తొట్టంబేడు, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త



జనసేన పార్టీ అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ను విమర్శించే అర్హత మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డికి లేదని ఉమ్మడి చిత్తూరుజిల్లా జనసేన కార్యదర్శి అంజూరు చక్రధర్ అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పవన్‌కళ్యాణ్‌కు జ్వరం వస్తే దానిని వక్రీకరించటం శోచనీయం అన్నారు. పవన్ కళ్యాణ్ హైదరాబాదుకు పోతే వైద్యశాఖను వ్యంగ్యంగా మాట్లాడటం ఆయన కుచ్చిత మనస్తత్వానికి నిదర్శనం అన్నారు. బియ్యపు మధుసూధనరెడ్డి ఉనికిని చాటుకోవటానికి తాపత్రయపడుతున్నారన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించటంతో పాటు ఆరోగ్య భరోసా కల్పించేందుకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసిందనేది జగమెరిగిన సత్యమే అయితే వైకాపా హయాంలో రాజకీయాన్ని వ్యాపారరంగం చేసిన ఘనులు నేడు తగుదనమ్మా అంటూ బియ్యపు మధుసూషధనరెడ్డి మాట్లాడటం శోచనీయం అన్నారు. ఇలాంటి చౌకబారు విధానాలకు స్వస్తి చెప్పాలని లేదంటే ప్రజలే బుద్ది చెబుతారని ధ్వజమెత్తారు.

## కార్యకర్తలకు అండగా డిజిటల్‌బుక్: అధికారంలోకి వస్తాం



**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త** రెడ్‌బుక్‌తో భయపెట్టిన నాయకులకు రాబోవు రోజుల్లో వైకాపా డిజిటల్ విధానంతో సమాధానం చెబుతామని నేటి అరాచకాల్ని లెక్కిస్తున్నామని రాబోవు రోజుల్లో ఎవ్వరిని వదలిపెట్టమని మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి ధ్వజమెత్తారు. ఆదివారం వైకాపా పార్టీ కార్యాలయంలో నేడు అధికార పార్టీ సాగిస్తున్న కక్షసాధింపులకు సమాధానంగా 'డిజిటల్ బుక్'ను ప్రారంభిస్తున్నామని వివరించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో అధికార పార్టీ వైకాపా కార్యకర్తలను పెడుతున్న ఇబ్బందులను క్యూఆర్‌కోడ్‌లో లెక్కిస్తున్నామని వివరించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత 257 కేసులు నమోదు చేసిన ఘనత ఒక్క కూటమికి స్థానిక శాసనసభ్యునికే దక్కిందన్నారు. దళితులు, బిసిలు మైనారిటీలపై కక్ష కట్టి విపరీతంగా కేసులు బనాయించారన్నారు. మనం అధికారంలోకి వచ్చే సమయం ఆసన్నమౌతుంది. మనం ప్రజలకు జవాబుదారి. ప్రజా సమస్యలపై వైకాపా నాయకులు స్పందించండి అంటూ పిలుపు నిచ్చారు. వైకాపా కుటుంబసభ్యులకు ఎక్కడ అన్యాయంజరిగినా డిజిటల్‌బుక్‌లో నమోదౌతుందన్నారు. ఇళ్ళు పడగొట్టడం, భూములు ఆక్రమించుకోవటం జరిగితే క్యూఆర్‌కోడ్‌ను నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆయనతో పాటు మాజీ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, వయ్యాల కృష్ణారెడ్డి, కోగిల సుబ్రమణ్యం, చెవిరెడ్డి మధుసూధనరెడ్డి, పగడాల రాజు, సురేష్, శరవణ కుమార్, మున్నారాయల్, కంఠా ఉదయ్, పఠాన్ ఫరీద్, సిరాజ్‌బాషా, సాయియాదవ్, జివికే రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దక్షిణ కాళీమాతకు మహాచండీ అలంకారం



శ్రీకాళహస్తి, రూరల్, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మండలం వేడాం గ్రామంలోని ఆలయంలో వెలసిన దక్షిణ కాళీ మాతకు దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆదివారం 'మహాచండి అలంకారాన్ని' నిర్వహించారు. అమ్మవారికి కన్నులు మిరుమిట్లు గొల్పునట్లు అర్చకులు చంద్రాస్వామి అలంకారం జరిపారు. శ్రీకాళహస్తి నుంచే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి విశేష సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అంతేకాక ఆదివారం కాబట్టి తమిళనాడు, కర్నాటకల నుంచి వచ్చిన భక్తులతో కళ కళ లాడింది. ఉభయదారులుగా గోపినాథ్‌రెడ్డి, కకీర్తిరెడ్డి, శ్రేయస్‌రెడ్డిలు హాజరయ్యారు. అమ్మవారికి మహాచండి అలంకారం జరిపారు. చూడటానికి కళ్ళు చాలవన్నట్లు తీర్చిదిద్దారు.

## ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



తిరుపతి విద్య, సెప్టెంబర్ 28 ప్రభాత వార్త: స్థానిక అనంత లా కళాశాల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఓ ప్రైవేటు హోటల్లో జరిగిన ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా ఛైర్మన్ అనంత రవి, మూడవ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి ఎం గురునాథ్, ఐదవ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి జి రాంగోపాల్ హాజరై విద్యార్థులకు అనంత రాజమ్మ మెమోరియల్ గోల్డ్ అండ్ సిల్వర్ మెడల్స్ ను మెరిట్ స్టూడెంట్స్ కి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయవాద వృత్తి ఎంతో కీలకమని, సమాజ సేవే లక్ష్యంగా నిబద్ధతో పనిచేయాలని సూచించారు. విజయం అనేది మార్కులు లేదా పతకాలతో కాదు. న్యాయ రంగంలో బాధ్యతాయుత పాత్రను పోషించడం, సమాజానికి సేవ చేయడం ఇవే నిజమైన విజయం. జ్యుడిషియల్ ఆఫీసర్ గా అయినా, లా ఆఫీసులో అయినా, లేదా న్యాయ వ్యవస్థలోని ఏ పదవిలో అయినా సేవ చేయగలగడం విజయానికి నిజమైన ప్రమాణం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సిరి కుమార్, వైస్ ప్రిన్సిపాల్ శారదా, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

## స్కౌట్ అండ్ గైడెన్స్ ఉద్యోగుల సమావేశం

**తిరుపతి విద్య, సెప్టెంబర్ 28 ప్రభాత వార్త:**



స్థానిక యూత్ హాస్టల్ వేదికగా హిందుస్తాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యగుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సంర్భంగా స్టేట్ కమిషనర్ తుంగా శ్రీకాంత్, చెర్మన్ పుల్లూరు దయాకర్ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు చేపట్టాల్సిన అంశాలు, బోధించాల్సిన నూతన అంశాలు, ధృవపత్రాల పంపిణీ వంటి అంశాలపై సదుర్ఘంగా చర్చించినట్లు తెలిపారు. సంస్థ అభివృద్ధి కోసం స్కౌట్స్ డిస్ట్రిక్ ఆఫీసర్స్ మాస్టర్స్ అండ్ గైడ్స్ సలహాలు తీసుకోవడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు సుమంత్, మధు, నజ్మా, శ్రీకాంత్, దివ్య, రహంతుల్లా, మనీష్, నాగచంద్ర తదితర ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సమాజాన్ని మార్చింది జాషువా సాహిత్యమే

తిరుపతి విద్య, సెప్టెంబర్ 28 ప్రభాత వార్త:



తెలుగు కవిత్వంతో సమాజంలో మార్పు తెచ్చి, ప్రజల సమస్యలను వెలుగులోకి తెచ్చిన మహాకవి, సమాజ సంస్కర్త గురం జాషువా అని ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మోంటరింగ్ కమిటీ మాజీ సభ్యులు రాపూర్ ప్రసాద్ బాబు కొనియాడారు. ఆదివారం గుర జాషువా 130 వ జయంతి సందర్భంగా స్థానిక గోవిందరాజస్వామి ఆర్ట్స్ కళాశాలలో పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో సమానత్వం నెలకొల్పేందుకు జాషువా చేసిన కృషి చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుందన్నారు. ఆయన ఆలోచనలు నేటికీ ప్రేరణనిస్తూనే ఉన్నాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాదిగ జనసైన్యం వ్యవస్థాపక అధ్యక్షులు సుధాకర్ మాదిగ, జోరేపల్లి కాటయ్య, ప్రభు, అర్జున్, నరేష్ పాల్గొన్నారు.

## రెస్లింగ్ ఛాంపియన్ షిప్‌లో సత్తా చాటిన చేరిష్మారెడ్డి

తిరుపతిరూరల్, సెప్టెంబర్28 ప్రభాతవార్త:



రెస్లింగ్ ఛాంపియన్ షిప్ పోటీలలో మద్దేరి చేరిష్మారెడ్డి అత్యుత్తమ ప్రతిభకనబరిచి, జాతీయస్థాయి పోటీలకు ఎంపికైయ్యారు. తిరుపతిరూరల్ మండలం దుర్గసముద్రం గ్రామ పంచాయతీ పరిధిలోని అడపారెడ్డిపల్లికి చెందిన చేరిష్మారెడ్డి 5వ రాష్ట్ర లెవల్ గ్రాప్లింగ్–రెస్లింగ్ ఛాంపియన్ షిప్‌లో ప్రతిభకనబరిచి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికకావడంపై పలువురు ఆమెను అభినందించారు. నవంబర్ నెలలో అయోధ్యలో జరిగే జాతీయ స్థాయి పోటీలలో ఆమె పాల్గొంటారు.

## నీళ్ల కోసం మహిళల ఆందోళన

**పుంగనూరు, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త** తమ కాలనీలో చాలా రోజులుగా కుళాయిల ద్వారా మీరు రాకపోవడంతో తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నామని గూడూరు పల్లె జగనన్న కాలనీ మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు ఆదివారం ఉదయం జాతీయ రహదారిపై ఖాళీ బిందెలతో ఆందోళనకు దిగారు. జాతీయ రహదారిపై వీరి ఆందోళన కారణంగా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న వెంటనే సిఐ సుబ్బరాయుడు పోలీస్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. తమకు నీరు రాకపోవడం వలన ఆందోళనక దిగామని మహిళలు ఆయనతో పేర్కొన్నారు. అధికారులతో మాట్లాడి మరి సమస్యకు పరిష్కారం ఏర్పాటు చేస్తానని సీఐ నచ్చ చెప్పడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

## వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ క్విజ్ పోటీలలో

యువతీ యువకులు పాల్గొనండి

**తిరుపతి క్రీడ, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త**

స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ ద్వారా యువతకు ఆన్‌లైన్‌లో క్విజ్ పోటీలు నిర్వహిస్తుందని సెట్విన్ సిఈఓ డా. పి. యశ్వంత్ తెలిపారు. క్విజ్ పోటీలో ఎంపికైన యువతీ యువకులు దేశ రాజధాని న్యూఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించే మెగా ఈవెంట్‌లో పాల్గొనే అవకాశంతో పాటు దేశ ప్రధాని, కేంద్ర మంత్రులు, సీనియర్ అధికారులు, ఇతర నాయకుల సమక్షంలో నేరుగా ప్రత్యక్షంగా తమ ఆలోచనలను ప్రదర్శించే ప్రత్యేక అవకాశం లభిస్తుందన్నారు. ఆసక్తి గల యువత అక్టోబర్ 15వ తేది వరకు నిర్వహించే ఆన్‌లైన్ క్విజ్ పోటీలో హెచ్‌టిటిపిఎస్:// మైభారత్.జిఓవి.ఇన్/క్విజ్ వెబ్ సైట్ ద్వారా పాల్గొనాలని కోరారు.

## ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ క్రీడాకారులకు ఉపాధి కల్పనే లక్ష్యం

– ఏసిఏ జాయింట్ సెక్రెటరీ విజయ్ కుమార్ (క్రికెట్ విజయ్)



**తిరుపతి క్రీడ, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త** ఉమ్మడి చిత్తూరు జిల్లాలలోని సీనియర్ క్రికెట్ క్రీడాకారులకు ఉపాధి కల్పన లక్ష్యంగా ఎంట్రీ లెవెల్ అంపైర్స్, స్కోరర్స్ నియామకానికి శ్రీకారం చుట్టామని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) జాయింట్ సెక్రెటరీ విజయ్ కుమార్(క్రికెట్ విజయ్) తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఓ ప్రైవేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఎంట్రీ లెవెల్ అంపైర్స్, స్కోరర్స్ రెండు రోజుల శిక్షణా శిబిరాన్ని ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. అనంతరం క్రికెట్ విజయ మాట్లాడుతూ గతం కంటే ఇప్పుడు సదుపాయాలు పెరగడమే కాకుండా, ప్రాబబుల్స్‌లో టీములు ఎక్కువగా తీసి ఎక్కువగా మ్యాచ్లు నిర్వహించడం వలన గొప్పగా రాణించగలుగుతున్నారన్నారు. జిల్లాలోని క్రికెట్ క్రీడాకారులు ముందు ముందు మరింత ఉన్నత స్థాయి క్రికెట్ ఆడగలరని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో చెప్పిన విధంగా సీనియర్ క్రికెటర్లకు ఉపాధి కల్పించేందుకు అంపైర్స్, స్కోరర్స్‌కు శిక్షణ కార్యక్రమం ప్రారంభించడం జరిగిందని, శిక్షణ అనంతరం జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఓ పరీక్ష విధానం ద్వారా సెలెక్ట్ చేయడం జరుగుతుందన్నారు. వారికి ఏసీఏ నిర్వహించే అంపైర్స్, స్కోరర్స్ పరీక్షలలో అర్హతను కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఆ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారిని క్వాలిఫైడ్ ఎంపైర్స్, స్కోరర్లుగా నియమిస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి రవి, కోశాధికారి గిరి ప్రకాష్, ఉపాధ్యక్షులు శ్రీనివాసమూర్తి, శ్రీధర్, జాయింట్ సెక్రెటరీ సతీష్ యాదవ్, సభ్యులు మురళి యాదవ్, కోలా హరిప్రసాద్, దివాకర్, రవి, మార్కండేయులు, సత్య శ్రీనివాస్, శివప్రసాద్, రమణ, ప్రకాష్, కోచ్‌లు సునీల్, క్వాలిఫైడ్ అంపైర్స్ సుదర్శన్, అన్సర్ ఖాన్, అకుల్ అన్నా, రామకృష్ణ, హషన్వావల్లి, కిరణ్, ఉదయ్, అకిబ్ తదితరులు పాల్గొన్నారు.

## కాత్యాయని అలంకరణలో షష్టిదుర్గ

వైభవంగా "శ్రీ ఉగ్రప్రత్యంగిరాకాళి" నవరాత్రి ఉత్సవాలు



**చంద్రగిరి, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త:** కాత్యాయని అలంకరణలో షష్టిదుర్గ భక్తులకు దర్శనమిచ్చారు. తొండవాడ పంచాయతీలోని శ్రీ ఉగ్రప్రత్యంగిరా కాళిపీఠంలో శరన్నవరాత్రి ఉత్సవాలను పీఠాధిపతి సూరీ స్వామి అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం 6 గంటల నుండి 7.30 గంటల గంటల వరకు అమ్మవారికి అభిషేకం జరిపించారు. తదుపరి 9 గంటల నుండి 12 గంటల వరకు కాత్యాయని హోమం నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తి వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణతో దేదీప్యమానంగా ముస్తాబు చేశారు. అమ్మవారి సేవకు నెల్లూరుకు పి.యశోద, తిరుపతికి చెందిన దివంగత జె.శంకర్ జ్ఞాపకార్థం ఆయన సతీమణి జె.లత, దాతలుగా వ్యవహరించారు.

## మహాలక్ష్మి అలంకరణలో దుర్గాదేవి

రామచంద్రాపురం, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త:



సూరావారిపల్లి సమీపంలో వెలసియున్న సురభిగో సంరక్షణశాలలో దుర్గాదేవి భక్తులకు మహాలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చారు. ఏకవీర సేవ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్ స్వామీజీ ఆధ్వర్యంలో ప్రముఖ న్యాయవాది ముమ్మడి లీలాకృష్ణ అమ్మవారికి వివిధ రకాల సుగంధపరిమళ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఐశ్వర్యం, సౌభాగ్యం, శాంతి, సంపదలను ప్రసాదించే మహాలక్ష్మిదేవి అలంకరణలో తీర్చిదిద్ది భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పవిత్రమైన ధునిపూజ, మహిమాన్వితమైన గోపూజ నిర్వహించి, అమ్మవారికి మంగళ హారతులిచ్చారు. సాయంత్రం భక్తులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి.

## గరుడవాహన సేవకు తరలిన వైసిపి కార్యకర్తలు

తుమ్మలగుంట కల్యాణ వెంకన్నకు సారె

**రామచంద్రాపురం, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త:** తుమ్మలగుంటలో వెలసియున్న శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో ఆదివారం గరుడవాహన సేవకు పెద్దఎత్తున మండలం నుండి వైసిపి నాయకులు, కార్యకర్తలు తరలివెళ్ళారు. ఇందులో భాగంగా ఎంపిపి ఎ.వి.బ్రహ్మానందరెడ్డి, జడ్పీటిసి ఢిల్లీరాణి భానుకుమార్‌రెడ్డి, వైసిపి మండల అధ్యక్షుడు యద్దల చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో కల్యాణ వెంకటేశ్వర స్వామి వారికి సారెను మోసుకుని వెళ్ళారు. ఆలయానికి చేరుకున్న వీరికి బ్రహ్మోత్సవ నిర్వహకులు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి, చెవిరెడ్డి రఘునాధరెడ్డి, ఆలయ అర్చకులు సాదర స్వాగతం పలికి సారెను స్వీకరించారు.

## దుర్గాదేవి అలంకరణలో శ్రీ సంతోషిమాత

చంద్రగిరి, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త:



దుర్గాదేవి అలంకరణలో శ్రీసంతోషిమాత భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక ఆర్ఎఫ్ రోడ్డులోని శ్రీశ్యామలాంబ సమేత మల్లేశ్వర స్వామి వారి ఆలయంలో వెలసియున్న శ్రీసంతోషిమాత శరన్నవరాత్రి ఉత్సవాలలో అమ్మవారు ఆదివారం దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి సేవకు చంద్రగిరి, పాతపేటకు చెందిన దోర్నకంబాల జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు డి.జగదీష్ (చంద్రగిరి) శంకర్ రెడ్డి దాతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ దాత రిటైర్డ్ హెచ్ఎం యారాశి చంద్రశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తిలో ప్రపంచ హృదయ దినోత్సవం-3కె రన్



**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి లోని ఎంజిఎం కార్పొరేట్ వైద్యశాల సారథ్యంలో ఆదివారం ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా 3కె రన్‌ను ఏర్పాటు చేసారు. ఎంజిఎం డైరెక్టర్ గూడ్లూరు మయూర్ ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు ముఖ్యఅతిధిగా ఆర్‌డిఓ భాను ప్రకాష్‌రెడ్డి హాజరయ్యారు. ఈ 3 కె.రన్‌లో సుమారు 600 మంది పాల్గొన్నారు. మరో అతిథిగా కమిషనర్ పి.భవాని ప్రసాద్ హాజరయ్యారు. ఆర్‌డిఓ భానుప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య దృష్ట్యా ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ముఖ్యమన్నారు. యువకుడైన ఎంజిఎం ఆసుపత్రి డైరెక్టర్ మయూర్ చొరవను అభినందించారు. కమిషనర్ భవాని ప్రసాద్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం పట్ల అప్రమత్తత ఎంతో అవసరం అన్నారు. ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించటం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఎంజిఎం అందిస్తున్న సేవల గురించి వివరిస్తూ గుండె సంబంధిత ఓపిని ఉచితంగా చూస్తున్నామన్నారు. ఎంజిఎం నుంచి బసవయ్యపాళెం సర్కిల్ వరకు 3కె.రన్ జరిగింది.

## అరవకొత్తురులో రెండు రోజులుగా అంధకారం

శ్రీకాళహస్తిరూరల్, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలం అరవకొత్తూరులో రెండు రోజులుగా విద్యుత్ సరఫరా లేక ప్రజలు తల్లడిల్లుతున్నారు. శ్రీకాళహస్తి పట్టణానికి కూత వేటు దూరంలో ఉన్న గ్రామంలో ఒరెండు రోజులుగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సంబంధిత శాఖ అధికారులు, సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు .కానీ ఎక్కడ సమస్యయే గుర్తించలేక పోతున్నారు. గ్రామంలో సుమారు 200 కుటుంబాలున్నాయి. విద్యుత్ సరఫరాలేక పోవటంతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వాతావరణం దృష్ట్యా ఇళ్ళలో ఏసిలు లేనిదే కష్టంగా మారింది. దాంతో వృద్ధులు, చిన్నారులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు.

## కొట్టె సాయిని సత్కరించిన కాపు సంఘం

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్‌గా జనసేన పార్టీ ఖరారు చేసిన కొట్టెసాయిని ఆదివారం శ్రీకాళహస్తిలోని శ్రీకృష్ణదేవరాయ బలిజ, తెలగ, కాపు సంఘం నాయకులు ఘన సన్మానం ఏర్పాటు చేసారు. సంఘం అధ్యక్షులు ఉప్పు కృష్ణయ్య అధ్యక్షతనే సన్మాన కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి చిన్న వయస్సులో ఒక సామాన్య పార్టీ కార్యకర్తకు జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఓ మహోన్నతమైన శ్రీకాళహస్తీశ్వరుని పాలకమండలి పగ్గాలను అందించటం పార్టీ కార్యకర్తలపట్ల ఆయన గుర్తింపుకు నిదర్శనం అన్నారు. తమ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి అత్యున్నతమైన శ్రీకాళహస్తీశ్వరుని పరిపాలనా అవకాశం కల్పించిన స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి, రాష్ట్రముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమంలో సిద్దులు గారి ప్రసాద్, రాఘవయ్య, గరికపాటి చంద్ర, సుబ్బారావు, పట్టాభి తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## ఓం శక్తి గుడిలో వస్త్ర, పనిముట్లు వితరణ

పుత్తూరు (నగరి), సెప్టెంబరు 28 ప్రభాతవార్త :



నగరి పట్టణంలో వెలసిన మేల్ మరువత్తూర్ ఆది పరాశక్తి ఆలయంలో దసరా ఉత్సవాల సందర్భంగా పలువురు దాతలు ఆదివారం పెద్ద ఎత్తున అన్న, వస్త్ర దానాలతో పాటు చేతి పనిముట్లను పంపిణీ చేశారు. సుమారు 900 మందికి అన్నదానం, 154 మందికి వస్త్రదానం, పలువురికి చేతి పనిముట్లతో పాటు ఆలయానికి రూ. 3000 వేలు విలువైన మిక్సీ గ్రైండర్ వితరణ చేశారు. అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేసి, విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తుల కోలాటాలు, భజనలతో ఆలయం మార్మోగ్రింది. ఆలయ నిర్వాహకులు భక్తులకు పసుపు దారాలు అందించారు. కార్యక్రమంలో దాతలు ఎం.వి.సరోజమ్మ వెంకటరత్నంనాయుడు, వారి కుటుంబ సభ్యులు ఎం.వి.మనోహర్, హరిబాబు, రవిబాబు, బాబు, రమేష్ బాబు, చెన్నైకి చెందిన రవిచంద్రన్, నెల్లూరు ఫిష్ డెయిరీ గుణశేఖర్, చెన్నై కుమార్, కన్నప్పనాయుడు, సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఛీత్కారాలు ఎదురైన చోట సత్కారాలు

**తిరుపతి, సెప్టెంబర్ 28ప్రభాతవార్త:**



సమకాలీన కవిత్వాన్ని ఆయుధంగా చేసుకుని మూఢాచారాలు అంటరానితనంపై తన రచనలతో ఛీత్కారాలు ఎదురైన చోట సత్కారాలు అందుకున్న ఆధునిక తెలుగుకవి గుర్రంజాషువా అని రాయలసీమ రంగస్థలి కొనియాడారు. జాషువా జయంతిని ఆదివారం కార్యాలయంలో ఆయన చిత్రపటంఉంచి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా రాయల సీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి, కళాకారులు తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, కన్నప్ప గారికేశవులు, శాంబోలు హరినాథ్, కెఎన్ రాజా, విజయభాస్కర్‌రెడ్డి, విజయసింహారెడ్డి, అన్నారెడ్డి .గోపా ల్‌రావు తదితరులు పాల్గోని జాషువా కవిత్వాన్ని ,ఆదునిక కవులు గురించి వివరించారు.

## శ్రీవారి ఆశీస్సులతో శుభాలు



–మధ్యప్రదేశ్ ఉపముఖ్యమంత్రి , శుక్లకు ఆత్మీయస్వాగతం

**తిరుపతి, సెప్టెంబర్ 28ప్రభాతవార్త:**

శ్రీవారి దర్శనార్థం తిరుపతికి విచ్చేసిన మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి రాజేంద్రశుక్లకు బిజెపి యువమోర్చా నాయకులుఆత్మీయ స్వాగతం పలికారు. శనివారం ఉదయం తిరుపతిలో బిజెపి యువమోర్చా నాయకులు జి.పృధ్వీరెడ్డి, వంశీ, జీవన్, ఈశ్వర్ పుష్ప గుచ్ఛంతో స్వాగతం పలికి దుశ్శాలువ సన్మానించారు. ఏడుకొండలస్వామి ఆశీస్సులుండాలని ఆకాం క్షించారు.

## సంక్షేమం మరింత అదనం

–మన్‌కీబాత్‌లో ప్రధాని మోదీ



**తిరుపతి, సెప్టెంబర్ 28ప్రభాతవార్త:**

దేశంలో ప్రజలకు సంక్షేమం అందించడంలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు పక్కాగా అమలుచేస్తున్నాయని ప్రదాని నరేంద్రమోదీ అన్నారు. ఆదివారం మన్‌కీబాత్‌లో బిజెపి నాయకులు గుండాల గోపీనాథరెడ్డి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, లక్ష్మయ్య, కళ్యాణి, రాజశేఖర్‌రెడ్డి, కెఎన్ రాజా, సుబ్రమణ్యం, సురేష్‌స్వామి తదితరులు మన్‌కీబాత్ వీక్షించారు. మోదీ అమలుచేస్తున్న సంక్షేమంతో ఈ కార్యక్రమంతో ప్రజలు కొత్త విషయాలు తెలుసుకోగలుగుతున్నారన్నారు.

## మూలస్థాన ఎల్లమ్మ ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం

తిరుపతిరూరల్, సెప్టెంబర్28 ప్రభాతవార్త:

తుమ్మలగుంట చెంచువారి కాలనీలో వెలసిన శ్రీమూలస్థాన ఎల్లమ్మ ఆలయం వద్ద ఆదివారం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరిగింది. ఉభయదారులు బిరుదాల హనుమంత్‌రెడ్డి, బిరుదాల జయసుధ దంపతుల ఆధ్వర్యంలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఉభయదారులకు ఆలయ ధర్మకర్త బిరుదాల సిద్దారెడ్డి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి, తీర్థప్రసాదాలు అందజేసారు. అమ్మవారి చిత్రపటాన్ని అందించి, దుస్సాలువతో ఘనంగా సత్కరించారు. అంతకమునుపు ఆలయం ముందు కోలాట భజనతో మహిళలు అలరించారు.

## కామాక్షిదేవి అంకరణలో మూలస్థాన ఎల్లమ్మ



దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శ్రీమూలస్థాన ఎల్లమ్మ కామాక్షిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తిరుపతిరూరల్ తుమ్మలగుంట చెంచు వారి కాలనీలో వెలసిన శ్రీ మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో దేవి నవరాత్రి ఉత్సవాలు ఆలయ ధర్మకర్త బిరుదాల సిద్దారెడ్డి ఆధ్వర్యంలో వైభవంగా జరుగుతున్నాయి.

## శ్రీదుర్గా దేవి అలంకరణలో శ్రీశక్తి చాముండేశ్వరిదేవి

తిరుపతిరూరల్, సెప్టెంబర్28 ప్రభాతవార్త:



దేవీ శరన్నవరాత్రులలో భాగంగా ఏడోవ రోజు శ్రీశక్తి చాముండేశ్వరి దేవి శ్రీదుర్గా దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తిరుపతిరూరల్ తుమ్మలగుంట క్రాస్, ఎల్ఎస్ నగర్‌లో వెలసిన శ్రీశక్తి చాముండేశ్వరి ఆలయంలో దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు కన్నులపండవుగా జరుగుతున్న విషయం తెల్సిందే. ఆదివారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, అలంకారము, హోమం నిర్వహించారు. ఉభయదారులుగా లోకేష్‌యాదవ్, దిలీప్‌కుమార్, హేమాద్రి, రామకృష్ణమనాయుడు, సునీత, సుధాకర్, రామ్మోహన్ తదితరుల ఆధ్వర్యంలో మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేసారు. ఉభయదారులకు ఆలయధర్మకర్త బిరుదాల భాస్కర్‌రెడ్డి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి, అమ్మవారికి చీరతో పాటు అమ్మవారికి తీర్థప్రసాదాలు అందజేసారు.

## ప్రాణాలతో చెలగాటం తుగునా...

అధికారుల ఎదుట స్థానికుల ఆవేదన

కేవీబీ పురం, సెప్టెంబరు 28 ప్రభాతవార్త: సామాన్య ప్రజల ఆరోగ్యంతో క్వారీ నిర్వాహకులు చెలగాటం ఆడుతున్నారని, గతంలో ఆందోళన చేస్తే కొద్ది రోజులు క్వారీకి తాళం వేసి మళ్లీ ఇప్పుడు ప్రారంభించి ప్రాణాలకు ముప్పు తెస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని మఠం సమీపంలో ఉన్న ఓ క్వారీని కాలుష్య నియంత్రణ బోర్డు ఛైర్మన్ కృష్ణయ్య ఆదేశాల మేరకు ఎస్ఈఈ ముని ప్రసాద్, ఈఈ జ్యోతి మనోహర్ బృందం పర్యటించి పరిస్థితిని పరిశీలించారు. బాధితులు మాట్లాడుతూ మండలంలో కొంత మంది నేతలు వారి స్వలాభం కోసం క్వారీని మళ్లీ ప్రారంభించేలా చేశారని అధికారులకు విన్నవించారు. క్వారీతో 15 గ్రామాల ప్రజలకు సాగు, తాగునీరు కలుషితం కావడమే కాకుండా బాంబుల మోతకు గృహాలు పగుళ్లు వస్తున్నాయన్నారు.

## జిల్లా వాణిజ్య విభాగం కార్యదర్శిగా నారపరాజు

విజయపురం, సెప్టెంబరు 28 ప్రభాతవార్త:



మండలంలోని పాతార్కాడు గ్రామానికి చెందిన పి.నారపరాజు వైసీపీ జిల్లా వాణిజ్య విభాగం కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను ఈ పదవికి ఎంపిక చేసిన మాజీ ముఖ్యమంత్రి జగన్‌కి, మాజీ మంత్రి రోజాకు, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలుపుతూ పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

వడమాలపేట, సెప్టెంబరు 28 ప్రభాతవార్త:



వడమాలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997 పదో తరగతి విద్యార్థులు ఆదివారం సమావేశమై గత స్మృతులను నెమరు వేసుకున్నారు. 60 మంది విద్యార్థులు హాజరై అప్పటి చదువు నేర్పిన గురువులను పిలిపించి ఘనంగా సన్మానించారు. అప్పుడెప్పుడో చదువుకుని నేడు మళ్లీ కలవడంతో నాటి అనుభవాలు, నేటి జీవిత గమనాలను ఒకరికొకరు తెలుసుకున్నారు. పాఠశాలలో 50 ఎర్రచందనం మొక్కలను నాటారు. పాఠశాల అభివృద్ధికి సహకరించాలని ప్రధానోపాధ్యాయులు, గురువులు పిలుపునిచ్చారు. రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు విష్ణువర్ధిని, విజయకుమారి, రమాదేవి, డేవిడ్, వెంకటాచలపతి, భాస్కర్‌రాజులు పూర్వ విద్యార్థులు సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి ముందుకు రావడం గొప్ప విషయమని కొనియాడారు. పూర్వ విద్యార్థులు శివకుమార్, నూతల పాటి కృష్ణయ్య, లకుమా, వేదవతి, మునిలక్ష్మి, మునికృష్ణ, ఈరిశెట్టి ప్రసాద్, రంజిత్‌కుమార్, సుధాకర్, నాగలక్ష్మి, జయరాం రెడ్డి, చంద్రబాబు, చిట్టిబాబు, భోగసేన, చెంగల్రాయులు, నటరాజు, కుప్పల మురళి, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

